ప్రజాశక్తి
శుక్రవారం 22 సెప్టెంబర్ 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

ఉమ్మడి జిల్లా

టిడిపి ఎమ్మెల్యేల సస్పెన్షన్

- సభలో చంద్రబాబు అరెస్టుపై చర్చకు డిమాండ్
- ఇరు పార్టీల సభ్యుల మధ్య వాదోపవాదాలు



సస్పెండ్ అయిన తెలుగుదేశం ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

అసెంబ్లీ ప్రారంభం రోజునే ఉమ్మడి ప్రకాశం జిల్లా తెలుగుదేశం ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ వీరాంజనేయస్వామి, ఏలూరి సాంబశివరావు సస్పెన్షన్‌కు గురయ్యారు. సభ ప్రారంభం కాగానే చంద్రబాబు అరెస్టుపై చర్చకు కొండపి ఎమ్మెల్యే డాక్టర్ బాలవీరాంజనేయస్వామి పట్టుబట్టారు. అందుకు స్పీకర్ అనుమతించలేదు. సభలో ఇరుపార్టీల సభ్యుల మధ్య వాదోపవాదనలు జరిగాయి. సభ వాడివేడిగా మారింది. సభ నడపడానికి వీల్లేని పరిస్థితిలో స్పీకర్ వాయిదా వేశారు. అనంతరం అసెంబ్లీ ప్రారంభం కాగా మళ్లీ తెలుగుదేశం ఎమ్మెల్యేలు ఇదే అంశంపై చర్చ సాగాలని పట్టుబట్టారు. తమ నేత చంద్రబాబును రాజకీయ కక్షతో అరెస్టు చేశారంటూ నినాదాలు చేశారు. అందరూ లేచి స్పీకర్ పోడియం వద్దకు వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. దీంతో మార్షల్స్ రంగ ప్రవేశం చేశారు. వైసిపి, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేల మధ్య గొడవ జరుగుతున్న సమయంలో మార్షల్స్ అడ్డుగా నిలిచారు. కాసేపు సభలో గందరగోళం కొనసాగింది. చర్చ సాగాల్సిందేనంటూ తెలుగుదేశం సభ్యులు నినాదాలు చేశారు. వైసిపి సభ్యులు కూడా ఎదురుదాడికి యత్నించారు. దీంతో స్పీకర్ తెలుగుదేశం ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు వేశారు. స్పీకర్ నిర్ణయంతో మార్షల్స్ తెలుగుదేశం ఎమ్మెల్యేలను బలవంతంగా బయటకు పంపారు. సభ బయట నినాదాలు చేసుకుంటూ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు.

'ప్రకాశం'ను విస్మరించిన సిఎం

- ఉపాధి లేక జిల్లా నుంచి వలసలు ఎక్కువయ్యాయి..
- బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి
- చీమకుర్తిలోకి ప్రవేశించిన సిపిఎం పోరుబాట పాదయాత్ర



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి

ప్రజాశక్తి-చీమకుర్తి

ఒక్కసారి అవకాశం ఇస్తే నిరుద్యోగం పోగొడతానని, వెలిగొండ పూర్తి చేస్తానని, పరిశ్రమలు తెస్తానని చెప్పిన ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక వాటిని మరిచారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి పేర్కొన్నారు. వెనుకబడిన ప్రకాశం జిల్లాను విస్మరించారని చెప్పారు. సిపిఎం పోరుబాట పాదయాత్ర గురువారం చీమకుర్తిలోకి ప్రవేశించింది. మండలంలోని కెవి పాలెం నుంచి బృందం చీమకుర్తి చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయుడుపాలెం రోడ్డులో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఏర్పాటై దశాబ్దాలు గడుస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లా అభివృద్ధికి పూనుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం పాకులాడడం తప్ప.. ఒక్క కొత్త పరిశ్రమ, ప్రాజెక్టులు తెచ్చిన దాఖలాలు లేవన్నారు. ఉపాధి లేక వలసలు ఎక్కువయ్యాయన్నారు. పదవులను కాపాడుకోవడం కోసం జగన్ నిత్యం ఢిల్లీ చుట్టూ తిరగడమే సరిపోయిందన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలన దోపిడీ పాలనగా మారిందన్నారు. ఉద్యమించే వారిపై అక్రమ కేసులు బనాయించి, ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్తును కేంద్ర ప్రభుత్వం వద్ద తాకట్టు పెట్టారని చెప్పారు. ప్రకాశం జిల్లా అభివృద్ధికి సిపిఎం పోరుబాట పాదయాత్ర బృందం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పోరాటంలో అన్ని ప్రజాసంఘాలూ కలిసి రావాలని, జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా పేరులో మాత్రమే ప్రకాశముందని, అభివృద్ధి శూన్యమన్నారు. జిల్లా అభివృద్ధికి చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, 2లో



చీమకుర్తిలో సిపిఎం బృందం పాదయాత్ర



ఉప్పు బస్తాలను లారీల్లోకి లోడ్ చేస్తున్న కూలీలు

కిలో ఉప్పు రూ.2 మాత్రమే..

- భారీగా తగ్గిపోయిన ధరలు
- 80 కేజీల బస్తా రూ.150కే..
- పెట్టిన ఖర్చులూ రాలేదని రైతుల ఆందోళన

2లో

గోవా మద్యం పట్టివేత

రూ.3 లక్షలు విలువైన బాటిళ్లు స్వాధీనం

3లో

రైతులకు సాగునీరు అందించాలి

- అన్నదాతలను ఆదుకోకుంటే ఆందోళన తప్పదు
- సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య
- చిట్టివాద, దరివాద పొలాల పరిశీలన



పొలాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు


ప్రజాశక్తి-చీరాల

దండుబాట ప్రాంతంలోని చిట్టివాద, దరివాదల్లో పొలాలకు ఇరిగేషన్ అధికారులు సాగునీరు అందించి.. ఆ ప్రాంత రైతులను తక్షణమే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని చిట్టివాద రైతుల పొలాలను సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ స్వాపర్ణపురం ఛానల్ చివరి భూములకు వెంటనే నీళ్లు విడుదల చేయాలని అన్నారు. ఆ ప్రాంతంలో సుమారు 3 వేల ఎకరాల పంట భూమి ఉంది అని ఈపాటికే కొందరు రైతులు వరి పంట వేశారని, మరికొందరు రైతులు నారుమడి పోశారు అన్నారు. ఎకరాకు సుమారు రూ.5 వేల నుండి రూ.10 వేల వరకు రైతులు ఖర్చు చేస్తున్నప్పటికీ ఆ భూములకు నీరు లేక పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని చెప్పారు. సాగు కాలాన్ని దృష్టిలో ఉంచుకొని భూముల్లో నారుమడులు వేయడం జరిగిందన్నారు. నెలలు గడుస్తున్నా చుక్కనీరు కూడా అందకపోవడంతో నేడు నారుమడులు ఎండిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సుమారు నాలుగు వేల ఎకరాల సాగుభూమి చిట్టివాద కింద ఉందని, ప్రతి ఏటా జులై నాటికి పొలాలకు నీరు పూర్తిగా అందేదని, అయితే ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యంతో సాగునీరు అందడం లేదని ఆరోపించారు. అక్కడ పొలాలకు నీరు వచ్చేందుకు ప్రత్యామ్నాయం కూడా లేదన్నారు. దీంతో చిన్న, సన్నకారు కౌలు రైతులందరూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కావున తక్షణమే ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి చిట్టి భూములకు సాగునీరు అందించాల్సిందేనని డిమాండ్ చేశారు. లేకుంటే 2లో

వినాయక నిమజ్జనంలో విషాదం

- నదిలో పడి ఇద్దరు దుర్మరణం
- భద్రతా చర్యల్లో అధికారుల నిర్లక్ష్యం





మృతిచెందిన వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్

ప్రజాశక్తి-రేపల్లె (బాపట్ల జిల్లా)

వినాయక నిమజ్జనం అపశృతి చోటుచేసుకుంది. వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేసే క్రమంలో ఇద్దరు యువకులు నదిలో పడి మృత్యువాతపడిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. నిమజ్జనం సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్న పోలీసులు, ఇతర అధికారుల ప్రకటనలు మాటలకే పరిమితమయ్యాయనేందుకు ఈ ప్రమాదమే నిదర్శనం.

పట్టణంలోని నేతాజీనగర్ వాసులు వినాయక చవితి సందర్భంగా విగ్రహం ఏర్పాటు చేశారు. మూడో రోజైన బుధవారం రాత్రి విగ్రహ నిమజ్జనం ఏర్పాట్లలో భాగంగా ఊరేగింపుతో పెనుమూడి కృష్ణానది ఒడ్డుకు చేరుకున్నారు. విగ్రహాన్ని నదిలో నిమజ్జనం చేస్తుండగా నేతాజీనగర్‌కు చెందిన పడమటి విజయకుమార్(20) కొండేటి వెంకటేశ్వర్లు (26) నదిలో పడిపోయారు. గమనించిన స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసే లోపే నదిలో మునిగిపోయి మతి చెందారు. వినాయక నిమజ్జన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై పోలీసులు దృష్టి పెట్టకపోవటంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కృష్ణానది పరివాహ ప్రాంతంలో వినాయక విగ్రహాలు నిమజ్జనం చేస్తుండటం ఎప్పటినుంచో ఆచారంగా ఉంది. అధికారులు సైతం కృష్ణానది నిమజ్జన ప్రాంతాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి పోలీస్ సిబ్బందిని కూడా నియమించటం పరిపాటిగా జరుగుతుండేది. ఈ సారి పోలీసులు, రెవెన్యూ, ఫైర్ అధికారులు కృష్ణ నదీ తీరాన భక్తుల నిమజ్జన సౌకర్యార్థం పటిష్టమైన చర్యలు తీసుకోలేదు. బారికేడ్లు, రోప్ తాడుల ఏర్పాటు, నది లోతును తెలియజేసే బోర్డులు, విద్యుత్ లైటింగ్, విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు నిపుణులతో కూడిన బందం, క్రేన్ మొదలగు సదుపాయాలు ఏర్పాటు చెయ్యటంలో పోలీస్, రెవెన్యూ, విద్యుత్, ఫైర్ సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను రేపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'ప్రకాశం'ను విస్మరించిన సిఎం

(మొదటిపేజీ తరువాయి)

ఎస్‌కె.మాబు, వెల్లంపల్లి ఆంజనేయులు, కాలం సుబ్బారావు, కె మాల్యాద్రి, డిఎంకె రఫీ, టి.కల్పన, బి.రఘురామ్, వి.బాలకోటయ్య, సిహెచ్.వినోద్, పమిడి వెంకటరావు, కెవిపాలెం ఎంపిటిసి వేమా అశ్విని, కె.చిన్నపురెడ్డి మాట్లాడారు. కార్యక్రమానికి ముందుగా బృందం పట్టణంలో పాదయాత్ర నిర్వహించారు. పట్టణ ప్రజలు స్వాగతం పలికి.. సమస్యలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు, టి.రామారావు, కొల్లూరి వెంకటేశ్వర్లు, బి.వీరాంజనేయులు, నల్లూరి కృష్ణయ్య, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

త్వరలోనే ఆ ప్రాంత రైతులందరితో కలిసి ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలు చేయవలసి వస్తుందని హెచ్చరించారు. పంట పొలాలను పరిశీలించిన వారిలో సిపిఎం ప్రాంతీయ నాయకులు ఎన్ బాబురావు పి కొండయ్య, కౌలు రైతు విమలాకర్ ఉన్నారు.



గణేష్ నిమజ్జన కార్యక్రమం చేస్తున్న దృశ్యం

గణేష్ నిమజ్జనం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల గ్రామపంచాయతీ పరిధిలోని సముద్ర తీరంలో గణేష్ నిమజ్జనా కార్యక్రం గురువారం నాడు కూడా కొనసాగుతున్నాయి. బుధవారం రాత్రి 7 గంటల తర్వాత సముద్ర తీరంలో గణేష్ నిమజ్జనం పోలీసులు నిలుపుదల చేశారు. దీంతో రాత్రంతా ఊరేగింపు నిర్వహించుకొని గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు పాకల సముద్ర తీరంలో వినాయకుల నిమజ్జన కార్యక్రమం కొనసాగుతూనే ఉంది. సిఐ దాచేపల్లి రంగనాథ్ ఎస్సై టి శ్రీరామ్ ఆధ్వర్యంలో సముద్ర తీరం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సముద్ర స్నానాలు చేసేటప్పుడు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మత్స్యకారుల సహకారంతోపాటు మెరైన్ పోలీసులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

లడ్డు వేలంపాట

ప్రజాశక్తి-కొమరోలు

మండలంలోని తాతిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో గణేశ్ లడ్డు వేలం పాటలో అదే కాలనీకి చెందిన కొమ్ములపాటి ఆదయ్య భార్య నాగలక్ష్మి రూ.50వేలకు లడ్డు పాట పాడారు. పట్టణంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో నిర్వహించిన గణేష్ లడ్డు వేలం పాటలో కొమరోలుకు చెందిన షేక్ ఖాజావలి రూ.36వేలకు వేలంపాట పాడి లడ్డును కైవసం చేసుకున్నారని గ్రామస్తుడు బ్రహ్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాతకోట బ్రహ్మారెడ్డి దస్తగిరి చంద్రమోహన్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కిలో ఉప్పు రూ.2 మాత్రమే..

- భారీగా తగ్గిపోయిన ధరలు
- 80 కేజీల బస్తా రూ.150కే..
- పెట్టిన ఖర్చులూ రాలేదని రైతుల ఆందోళన



కొటారు దగ్గర నిల్వ ఉన్న ఉప్పు

ప్రజాశక్తి-శింగరాయకొండ

నిత్యం మనం వాడే ఉప్పు ధరలు భారీగా తగ్గిపోయాయి. పెట్టిన పెట్టుబడి కూడా రాలేదని ఉప్పు రైతులు వాపోతున్నారు. గత సంవత్సరంలో ఆకాశాన్ని అంటిన ఉప్పు ధరలు ఇప్పుడు పాతాళ గంగలోకి పోయాయని ఉప్పు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉప్పు చూస్తే అత్యంత దారుణంగా ఉందని మమ్మల్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరుతున్నారు. శింగరాయకొండ మండలంలో పాకల ఊళ్లపాలెం బింగినపల్లి గ్రామపంచాయతీలో 1500 ఎకరాలకు పైగా ఉప్పును పండిస్తుంటారు. ఊళ్లపాలెం గ్రామంకీ ఓ ప్రత్యేకత కూడా ఉంది. ఉప్పు ఊళ్ల పాలెం గ్రామం నుంచి మన రాష్ట్రం తో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా ప్రతిరోజు లారీల ద్వారా పదుల సంఖ్యలో ఉప్పు రవాణా అవుతుంది. అలాంటి గ్రామంలో ఎక్కువమంది ఉప్పుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పరిస్థితుల్లో. దాని నీ నమ్ముకున్న వారికి ఈ సంవత్సరం దారుణంగా ఉంది. 80 కేజీలు బస్తాకి ఉప్పును ఎత్తుతుంటారు. ప్రస్తుతం 150 రూపాయలు మాత్రమే బస్తా ఉంది. మంచి తెల్ల ఉప్పు ఒక బస్తా 200 మాత్రమే ధర పలుకుతున్న పరిస్థితి కనిపిస్తుంది. గత సంవత్సరం ఇదే రోజుల్లో ఒక బస్తా 350 రూపాయల నుంచి 400 రూపాయల వరకు అధిక ధరలోకి వెళ్లిపోయి ఉప్పు రైతు ఆనందపడే విధంగా చేసింది. కానీ ఈ సంవత్సరం మాత్రం భారీగా తగ్గిపోయి 150 రూపాయలు నుంచి 200 రూపాయలకు మాత్రమే బస్తా ఉప్పు ధర పలుకూతుంది. ఒక్క ఎకరాకి1000 బస్తాలు ఉప్పు ఈ ప్రాంతంలో దిగుబడి అవుతుంది. అయితే ఈ సంవత్సరం వర్షాలు పడినప్పటికీ పండించడంలో కొంత తగ్గింది. ఎకరాకి ప్రస్తుతం 750 బస్తాలు మాత్రమే ఉప్పు దిగుబడి అవ్వటం జరిగింది. ఉప్పు దిగుబడి రావడానికి ఒక ఎకరాకు పెట్టుబడి 60 వేల నుంచి 70000 వరకు ఖర్చవుతుంది అని చెబుతున్నారు.ఓ పక్క వర్షాలు దెబ్బకి తక్కువ దిగుబడి అయినప్పటికీ. ధరలు లేకపోవడం ఉప్పు రైతుకు నిరాశ కల్పిస్తుంది. ఈ ప్రాంతం నుంచి ఉప్పు హైదరాబాదు అధిక సంఖ్యలో వెళుతుంది. విశాఖపట్నం విజయవాడ ప్రాంతాలకు కూడా ఉప్పు సరఫరా చేస్తుంటారు. ఉప్పుపై ఆధారపడుతున్న ఈ ప్రాంతంలోని ఉప్పు రైతులు ఉప్పు ధరలు భారీగా తగ్గిపోవడంతో నిరాశకు గురవుతున్నామని రైతులు వాపోతున్నారు.

కౌలు రైతు పరిస్థితి మరి దారుణంగా ఉంది

ఉప్పు ధరలు తగ్గిపోవటం వల్ల కౌలు రైతు పరిస్థితి దారుణంగా ఉంది. దిగుబడి పూర్తిస్థాయిలో రాకపోవడంతో కౌలు కట్టలేని పరిస్థితిలో ఉన్నామని ఉప్పు కౌలు రైతులు చెబుతున్నారు. గత సంవత్సరం అధిగ ధరలు వచ్చాయని ఎకరా 60 వేల నుంచి లక్ష రూపాయలు వరకు ఎకరాకు కవులు చెల్లించిన ఉప్పు రైతు. ఈ సంవత్సరం కూడా అదే పరిస్థితిలో ఉంటుందని ఆశించి రంగంలోకి దిగితే పండిన దిగుబడికి కవులు కూడా కట్టని పరిస్థితిలో ఉన్నామని వాపోతున్నారు.

పెరిగిన కూలీలు

ఉప్పు కొట్టారు లో పనిచేసే కూలీలకు గత సంవత్సరం ఉప్పు రైతులు ఉప్పు ధరలు పెరిగాయని కష్టపడి పని చేస్తున్న కూలీలకు 300 రూపాయలు ఉన్న కూలి 500 కు పెంచారు. అదేవిధంగా ఉంటుందని అప్పుడు అనుకున్న ఉప్పు రైతులు. ఈ సంవత్సరం పరిస్థితిని చూసి పూర్తిస్థాయిలో ఉప్పు దిగుబడి రాక. పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితుల్లో ఉండటం జరిగిందన్నారు. కూలి ధరలు పెరిగిన ఉప్పు రైతు ఉప్పు ధర పెరగకపోవడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నారు.

అవగాహన సదస్సు ప్రాముఖ్యతను తెలుసుకోవాలి..

పేస్ కళాశాల ప్రొఫెసర్ ఏలియా

ప్రజాశక్తి-టంగుటూరు

భవిష్యత్తు ప్రయోజనాలపై నిర్వహించే అవగాహన సదస్సుల ప్రాముఖ్యతను కళాశాల విద్యార్థులు తెలుసుకోవాలని పేస్ కళాశాల ఎంబీఏ అసోసియేట్ ప్రొఫెసర్ కె ఏలియా విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రిపుల్ ఈ చదువుతున్న విద్యార్థులకు 'ఏంజెల్ పెట్టుబడి, వెంచర్ క్యాపిటల్ ఫండింగ్ అవకాశం' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏంజెల్ పెట్టుబడి, వెంచర్స్ క్యాపిటల్ ఫండింగ్ అవకాశాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల ఆర్థిక ఎదుగుదలకు ఈ సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ అవగాహన సదస్సుల ద్వారా విద్యార్థులు పెట్టుబడులపై అవగాహన పెంచుకుని భవిష్యత్తులో ఆర్థికాభివద్ధి సాధించవచ్చని ప్రొఫెసర్ ఏలియా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, కళాశాల ట్రిపుల్ ఈ విభాగాధిపతి బి నాగరాజు, కోకన్వీనర్లు సిహెచ్ జగదీశ్వర్ రెడ్డి, బి వెంకటేష్, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఏలియా

గోవా మద్యం పట్టివేత

- నిందితులు అరెస్టు
- కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్ఇబి ఎఐఎస్ సుధీర్‌బాబు


సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, కారు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

గోవా నుంచి కంటైనర్ల ద్వారా అక్రమంగా మద్యం తీసుకొచ్చి బెల్టు షాపులకు విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఇబి) అధికారులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3 లక్షల విలువైన మద్యం బాటిళ్లు, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఇబి కార్యాలయంలో ఏర్పాటు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఇబి ఎఐఎస్ ఎం.సుధీర్ బాబు వివరాలు వెల్లడించారు. ఎఐఎస్ ఎం.సుధీర్ కథనం ప్రకారం... సెబ్ అదనపు ఎస్పి ఆదేశాల మేరకు గోవా నుంచి కంటైనర్ల ద్వారా మద్యాన్ని తరలించి బెల్టు షాపులకు విక్రయిస్తున్న ముఠాపై ఎస్ఇబి అధికారులు నిఘా పెట్టారన్నారు. మడనూరు శివారులో ఎన్‌జిపాడు మండలం చిన్నంగారిపట్టపుపాలెంకి చెందిన నేత్రబాబు, సింగరాయకొండ మండలం ఊళ్ళపాలెంకి చెందిన అరవ పవన్ గోవా నుంచి చౌకగా దొరికే మద్యాన్ని అక్రమంగా తరలించి బెల్టు షాపులకు విక్రయిస్తుండగా ఎస్ఇబి అధికారులు పట్టుకున్నారన్నారు. వీరి వద్ద నుంచి గోవాకు చెందిన 416 మద్యం బాటిళ్లు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 282 మద్యం బాటిళ్లు, మద్యాన్ని బెల్టు షాపులకు తరలిస్తున్న కారును స్వాధీనం చేసుకున్నారు. గోవా నుంచి తీసుకొచ్చిన మద్యం బాటిళ్ళ వెనుక భాగంలో మద్యం సేవించటం ఆరోగ్యానికి హానికరం, గరిష్ట చిల్లర ధర, మద్యం సేవించి వాహనం నడుపరాదు అంశాల లేబుళ్ళను అంటించి వాటిని బెల్టు షాపులకు విక్రయిస్తున్నారు. నేత్రబాబు, పవన్, కంటైనర్ డ్రైవర్ గోవాకు చెందిన ఫ్రాన్సిస్, వారికి సహకరించిన వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సుధీర్‌బాబు తెలిపారు. అక్రమమద్యాన్ని పట్టుకున్న ఎస్ఇబి ఒంగోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.లత, ఎస్ఐ గోపాలకృష్ణకుఆయన అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఇబి సిబ్బంది పాల్గొన్నారు.

పురిటి బిడ్డ మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బాధితుల ఆందోళన


మృతిచెందిన పురిటి బిడ్డ


వైద్యశాల వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి - గిద్దలూరు

వైద్యుల నిర్లక్ష్యంతో పురిటి బిడ్డ మృతి చెందింది. ఈ ఘటన గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం చోటు చేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మతి చెందిందని బాధితకుటుంబ సభ్యులు వైద్యశాల ఎదుట ఆందోళన చేపట్టారు.బాధితుల కథనం ప్రకారం... గిద్దలూరు మండలం అంబవరం గ్రామానికి చెందిన షేక్ హాసీనా పురిటి నొప్పులతో మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. వైద్యులు గురువారం ఆపరేషన్ చేసి ఆడ శిశువును బయటకు తీశారు. శిశువుకు కొద్దిసేపటి తర్వాత ముక్కుల నుంచి ఉమ్మ నీరు రావడంతో మృతిచెందింది. ఈ విషయం గురించి వైద్యులను అడుగగా బిడ్డ ఉమ్మ నీరు ఎక్కువగా వల్లే మృతిచెందినట్లు తెలిపారు. వయసులో ఉన్నావు.. ఇంకో బిడ్డకు జన్మను ఇవ్వొచ్చునని బాధితురాలిని హేళన చేసినట్లు వారు వాపోయారు. అనంతరం బాధితురాలి కుటుంబ సభ్యులు వైద్యశాల ఎదుట ఆందోళన చేశారు. పోలీసులు ఆసుపత్రి వైద్యశాల వద్ద వచ్చి బాధితరాలి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

ఉమ్మనీరు తాగడం వల్లే బిడ్డ మృతి

సూరిబాబు, వైద్యశాల సూపరిండెంట్,

సరైన సమయంలోనే వైద్యం అందించి ఆపరేషన్ చేసి బిడ్డను తీశాం. అంతకుమునుపే బిడ్డ శ్వాస తీసుకోవడం వల్ల ఊపిరి తిత్తులలోకి ఉమ్మనీరు చేరింది. ఫలితంగా బిడ్డ చనిపోంది. ఇలా జరగడం చాలా అరుదు.ఇందులో వైద్యుల నిర్లక్ష్యం అంటూ ఏమి లేదు.

పాఠశాల అభివృద్ధికి..

దాతల సహకారం అభినందనీయం

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్


ప్రతాపరెడ్డి, మల్లికార్జున రెడ్డి లను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పాఠశాల అభివద్ధికి ప్రతాపరెడ్డి సహకారం అభినందనీయంమని ఉప్పలపాడు ప్రాథవికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ నాయబ్ రసూల్ తెలిపారు. మండల పరిధిలోని ఉప్పలపాడు ప్రాథమికోన్నత పాఠశాలకు వైస్ ఎంపిపి దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి రూ.30 వేలు విలువైన సౌండ్ బాక్స్, పది కుర్చీలను గురువారం బహూకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నాయబ్ రసూల్ మాట్లాడుతూ పాఠశాల అభివద్ధికి గ్రామస్తులు సహకరించాలన్నారు. అనంతరం దాత, వైస్ ఎంపిపి దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, సర్పంచి ప్రవీణ్ కుమార్, గ్రామ పెద్ద పాలుగుళ్ల మల్లికార్జున రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాలుగుళ్ళ రత్నారెడ్డి, షేక్ బుడేసా, సిద్దు వెంకటరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ వాడ లక్ష్మిరెడ్డి, జి. చినమాల కొండయ్య, సూర్యనారాయణ రెడ్డి, శివారెడ్డి, ఉపాధ్యాయులు కమ్మనేతి వెంకటేశ్వర్లు, ఆనంద్ బాబు, పున్నమ్మ, రామయ్య, ఖాజా రహంతుల్లా, ఆంటోని, ఎలికా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

- అత్తింటి వారి వేధింపులే కారణమంటూ సూసైడ్ లెటర్


ఉమారాణి(ఫైల్)

ప్రజాశక్తి - చీరాల

అత్తింటి వారి వేధింపులు తాళలేక మస్తాపానికి గురైన ఓ వివాహిత ఉరేసుకొని మృతి చెందింది. ఈ ఘటన చీరాల నవాబ్ పేటలో గురువారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం... నవాబ్ పేటకు ఉమారాణి, ఉమా మహేశ్వరరావుకు పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి సంతానం లేకపోవడంతో ఓ బాబును దత్తత తీసుకొని పెంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఆస్తి ఆ పిల్లవాడికి ఎక్కడ చెందుతుందనే ఉద్దేశ్యంతో ఉమా మహేశ్వరరావు తల్లిదండ్రులు, సోదరుడు గాంధీ, లక్ష్మీనారాయణ, కష్ణవేణి మతురాలు ఉమారాణి మానసికంగా చిత్రహింసలకు గురి చేస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురైన మారాణి ఉరేసుకొని మృతిచెందింది. తన మృతికి అత్త, మామ, బావ వేధింపులే కారణమని ఉమారాణి సూసైడ్ లెటర్‌లో రాసింది. సూసైడ్ లెటర్ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో మహిళా కూలీ మృతి

ప్రజాశక్తి- కొత్తపట్నం


నాగలక్ష్మి (ఫైల్)

విద్యుత్ షాక్‌తో ఓమహిళా కూలీ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రంగాయ పాలెం గ్రామ సమీపంలోని పొలాల్లో గురువారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామానికి చెందిన సామంతుల నాగలక్ష్మి(45), మరికొంతమంది మహిళలు కలిసి కొత్తపట్నం గ్రామానికి చెందిన కిష్టం శేషయ్య పొలంలో వేరుశనగ పంటను పీకేందుకు వెళ్లారు. పొలంలో పని చేస్తున్న సమయంలో మతురాలు నాగలక్ష్మి పనికి అడ్డుగా అల్యూమినియం పైపును తీసి ప్రక్కన పెట్టేందుకు ప్రయత్నించింది. అదే సమయంలో అల్యూమినియం పైపు పైన ఉన్న విద్యుత్ వైర్లకు తగలడంతో షాక్‌గురైకు పడిపోయింది. ఈ విషయాన్ని గుర్తించి తోటి మహిళలు వెంటనే కొత్తపట్నం ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు నాగలక్ష్మిని పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మతురాలి భర్త నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాంబశివరావు తెలిపారు.

ఎంఇఒ, టీచర్ ఘర్షణ ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

దోర్నాలో ఎంఇఒ, ఉపాధ్యాయుడు మధ్య ఘర్షణ ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంకమ్మరావు గురువారం తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుధాకర్, ఎంఇఒ బి.మస్తాన్‌నాయక్ మధ్య బుధవారం ఘర్షణ చోటు చేసుకున్న విషయం తెలిసిందే.. సుధాకర్‌పై ఎంఇఒ విధులకు ఆటంకపరిచి.. కులం పేరుతో దూషించి దాడికి దిగినట్లు కేసు నమోదు చేయగా.. ఎంఇఒ మస్తాన్ నాయక్‌పై సుధాకర్‌పై దాడికి పాల్పడినట్లు.. వారివారి ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

చికెన్ సెంటర్‌లో చోరీ

ప్రజాశక్తి - పంగులూరు

పంగులూరులోని ఓ చికెన్ సెంటర్‌లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. చికెన్ సెంటర్ తలుపు తాళాలు పగలగొట్టి కోళ్లు, రెండు సిలిండర్లు, రూ.8 వేల విలువైన సిగరెట్ ప్యాకెట్లు, కాటా, టీవీ, సిసి కెమెరా పవర్ ప్లాంట్ సెట్ ను అహరించారు. చికెన్ సెంటర్ నిర్వాహకుడు స్వర్ణ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... కోటేశ్వరరావు కెవిఎస్ చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. రోజులాగే బుధవారం రాత్రి చికెన్ సెంటర్‌కు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం షాపుకు వచ్చేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా క్వింటా బాయిలర్ కోళ్లు, రెండు నాటు కోళ్లు, రూ.8 వేల విలువైన సిగరెట్ ప్యాకెట్లు, కాటా, టీవీ, సిసి కెమెరా పవర్ ప్లాంట్ సెట్ కనిపించలేదు.

నేడు దర్శిలో ప్రత్యేక స్పందన

ప్రజాశక్తి-దర్శి

దర్శిలోని అద్దంకి రోడ్డులోనున్న శ్రీనివాస పద్మావతి కల్యాణ మండపంలో శుఉక్రవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు కె.వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేసి పరిష్కరించు కోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. దర్శి ప్రాంత ప్రజలు ఈ అకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



దీక్షలు చేస్తున్న పంచాయితీ కార్మికులు (సిఐటియు)

పంచాయతీ కార్మికుల నిరసన దీక్షలు

ప్రజశక్తి - చీరాల

చాలీచాలని వేతనాలతో పంచాయతీ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు అన్నారు. కార్మికుల వేతనాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఏపీ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె గురువారంకు 2వ రోజుకు చేరుకుంది. మూడేళ్లుగా వేతనాలు పెంచకపోగా ఉన్న వేతనంలో తగ్గించి ఇస్తున్నట్లు తెలిపారు. పీఎఫ్, ఈఎస్ఐ అమలు కావడం లేదన్నారు. 2019లో రూ.18వేలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానం గాలికి వదిలేశారని ఆరోపించారు. పంచాయతీ ఇన్చార్జి సెక్రెటరీ ప్రసాద్ సమ్మె వాయిదా వేయాలని కోరినప్పటి రోజు వేతనం రూ.400పెంచితేనే విరమిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇండ్ల చెంచయ్య, గడ్డం ప్రసాద్, కాకి భాగ్యమ్మ, తన్నీరు సీతమ్మ పాల్గొన్నారు.



బస్టాండు వద్ద ధర్నా చేస్తున్న హైర్‌బస్ డ్రైవర్లు

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

ప్రజశక్తి - చీరాల

ఆర్టీసీ డిపో మేనేజర్ హయ్యార్ బస్సు డ్రైవర్ల పట్ల కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ హయ్యర్ బస్సు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో గురువారం ధర్నా నిర్వహించారు. హయర్ బస్సు డ్రైవర్లు ఎం శ్రీనివాసరావు, శివయ్యలను ఎలాంటి కారణం లేకుండా విధుల నుండి తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. హయ్యర్ బస్సు డ్రైవర్లను తొలగించే అధికారం డిఎంకు లేదన్నారు. ఆర్టీసీ ఒప్పంద ప్రకారం బస్సులో ఏదైనా సమస్య ఉంటే బస్సు ఓనర్‌తో చర్చించాలని అన్నారు. నెల రోజుల క్రితం విజయవాడ నుంచి చీరాల వచ్చే హైయర్ బస్సులో ప్రయాణిస్తున్న శ్రీనివాసరావు అదే బస్సు నడుపుతున్న శివయ్యపై అకారణంగా దాడి చేశాడని, దాడిని డిఎం శ్యామల ఖండించక పోగా దాడి గురైన వ్యక్తినే తప్పు బట్టి ఎదురు దాడి చేస్తున్నారని అన్నారు. ప్రతి మంగళవారం జరిపే గ్రీవెన్స్‌ని డిఎం నిర్వహించడం లేదన్నారు. వెంటనే తొలగించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు ఎన్ బాబురావు, బి వెంకటేశ్వర్లు, హెయిర్ బస్సు వర్కర్ యూనియన్ అధ్యక్షుడు ఎర్రం నాగిరెడ్డి, ఎం శివయ్య, మాణిక్యరావు పాల్గొన్నారు.


గురజాడకు నివాళి అర్పిస్తున్న జెవివి నేతలు

'గురజాడ'కు నివాళి

ప్రజశక్తి - చీరాల : మహాకవి గురజాడ అప్పారావు జయంతి వేడుకలను జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కేజి ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర రామారావు, జిల్లా ఉపాధ్యక్షులు బండి బిక్షాలుబాబు, బిరుదు పిచ్చయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్‌సి సుబ్బారెడ్డి, అధ్యక్షులు సిహెచ్ వెలిగొండరెడ్డి, బాధ్యులు ఎన్ రాజేష్, ఎస్‌డి జానీభాష, సీనియర్ నాయకులు డి నారపరెడ్డి, జాగర్లమూడి వెంకటేశ్వరరావు, మాలాద్రి హేమంత్ పాల్గొన్నారు.

గురజాడ రచనలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - బాపట్ల

అభ్యుదయ భావ విప్లవానికి గురజాడ అప్పారావు అడుగుజాడ తెలుగుజాతికి వెలుగు జాడని ఎంఈఓ ఎస్ నిరంజన్ కొనియాడారు. జెవివి సాంస్కృతిక విభాగం రాష్ట్ర నాయకులు కోటా వెంకటేశ్వరరెడ్డి ఆధ్వరంలో స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మహాకవి గురజాడ 161జయంతి నిర్వహించారు. ఎంఈఓ నిరంజన్ మాట్లాడుతూ 1910లో గురజాడ రచించిన దేశభక్తి గీతం నేటి సమ కాలీన సమాజానికి మహెూన్నత సందేశమని అన్నారు. గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురజాడ దేశభక్తి గీతాన్ని అందరూ బృందంగా ఆలపించారు. గీతంలోని ప్రతి చరణంలో ఉన్న సారాంశాన్ని వివరించారు. జెవివి జిల్లా అధ్యక్షులు వై భాస్కరరావు మాట్లాడుతూ గురజాడ గొప్ప సంఘ సంస్కర్తని అన్నారు. కన్యాశుల్కం నాటకాన్ని రచించి బాల్య వివాహాలు, సాంఘిక దురాచారాలపై తన సాహిత్యం ద్వారా పోరాటం చేశారని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరావు, ఎంఈఓ-2 డి ప్రసాద్, పద్మశ్రీ, హరిత, దేవయ్య, అనిల్, మాణిక్యరావు, కెవి నారాయణ, షేక్ మహబూబ్ సుభాని పాల్గొన్నారు.

బాపట్ల రూరల్ : గురజాడ రచనలు స్ఫూర్తిదాయకమని ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకులు, సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు 161వ జయంతి సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాలలో గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గురజాడ అప్పారావు సాంఘిక దురాచారాలపై పోరాడిన సంఘసంస్కర్త అని అన్నారు. మహిళల అభ్యున్నతి కోసం కృషి చేసిన వ్యక్తని అన్నారు. ఎన్నో నాటికలు, కథలు, దేశభక్తి గేయాలు రచించారని అన్నారు. నేటి తరానికి ఆయన రచనలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని అన్నారు. విద్యార్థులు వాటిని చదివి అర్థం చేసుకోవాలని కోరారు. దేశ ఐక్యత కోసం, సమాజాభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నారు. వితంతువులకు పునర్వివాహాలు చేయడం కోసం కృషి చేశారని అన్నారు. కన్యాశుల్కం కథను నాటిక రూపకల్పన చేసి ప్రదర్శించి స్త్రీలలో చైతన్యం తీసుకురావడం కోసం కృషి చేశారని చెప్పారు. దేశమును ప్రేమించమన్న మంచి అన్నది పెంచుమన్నా అనే దేశభక్తి గేయాన్ని రచించి దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని చాటిచెప్పి దేశభక్తిని రగిల్చారని అన్నారు. కానీ నేడు దేశంలో జరుగుతున్న విషయాలను పరిశీలిస్తే ప్రజలను మతాలు, కులాల వారీగా విడగొడుతూ విద్వేషాలు రెచ్చగొట్టే కుట్రలపట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మనోజ్ కుమార్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు గురజాడ వంటి సంస్కర్తల జీవిత చరిత్రను తెలుసుకొని స్ఫూర్తి పొందాలని అన్నారు. సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడి స్త్రీ విద్య కోసం కృషి చేశారని అన్నారు. అందువల్లనే మహిళలు చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉన్నారని అన్నారు. గురజాడ వంటి సంఘసంస్కర్తలు చేసిన త్యాగాల ఫలితమే నేటి అభివృద్ధి అని అన్నారు. నేడు సాంప్రదాయాల పేరుతో ముంచుకొస్తున్న ఆధునిక సాంఘిక వివక్షతకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు సుభాషిని, కళాశాల స్టాఫ్ శీలం సాగర్ పాల్గొన్నారు.


గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిహెచ్ గంగయ్య


గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెవివి నాయకులు

ప్రమాద నివారణ జాగ్రత్తలు తీసుకోవాలి

- బాధితులకు రూ.10లక్షల పరిహారం ఇవ్వాలి
- తహశీల్దారు కార్యాలయంలో వినతి
- బాధితులకు అండగా సిపిఎం

ప్రజాశక్తి - రేపల్లె

వినాయక నిమజ్జనంలో అధికారులు వైఫల్యం వల్ల చనిపోయిన ఇద్దరి కుటుంబాలను ఆదుకోవాలి, ఆ కుటుంబాలకు రూ.10లక్షలు పరిహారం ఇవ్వాలనీ సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. మండలంలో వినాయక విగ్రహాల నిమజ్జనం చేస్తున్న పెనుమూడి నదివద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అధికారాలు వైఫల్యం వల్ల ప్రమాదంలో చనిపోయిన పడమటి విజయకుమార్, కొండేటి వెంకటేశ్వరరావు కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ తహసిల్దారు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. గత కొన్ని సంవత్సరాల పెనుమూడి వద్ద వినాయక చవితి సదర్భంగా నిమజ్జనాలు చేస్తున్నారని అన్నారు. ప్రతిరోజు వేల సంఖ్యలో భక్తులు వస్తూ ఉంటారని తెలిపారు. రేపల్లెతోపాటు నగరం, నిజాంపట్నం, భట్టిప్రోలు, చెరుకుపల్లి మండలాల నుండి కూడా పెనుమూడి వద్దనే నిమజ్జనాలు చేస్తుంటారని తెలిపారు. గతంలో తహశీల్దారు పర్యవేక్షణలో రెవిన్యూ, పోలీస్, పంచాయితీ, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, గజ ఈతగాళ్ళు అందుబాటులో ఉండేవారని తెలిపారు. ప్రస్తుతం ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు, ప్రణాళిక ప్రకారం లేకపోవటం వల్లనే ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. రెండు కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపియం నాయకులు వై కిషోర్, కె అశ్వీరాధం, కె రమేష్, ఆగస్టిన్, వి తులసిరాముడు, ఎం వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.



తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

అగ్రి టెస్టింగ్ ల్యాబ్ అన్నారు... పరీక్షలెప్పుడో.?

ప్రజాశ:క్తి - యర్రగొండపాలెం

వివిధ ఉత్పత్తుల నాణ్యత నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు డాక్టర్ వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను అందు బాటులోకి తీసుకొస్తాం. ల్యాబ్‌లో రైతులు విత్తనాలు, ఎరువులను ఉచితంగా పరీక్షిం చుకోవచ్చు. నాణ్యమైనవి విత్తుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చనే ఉద్దేశ్యంతో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు నెలకొల్పుతున్నాం. అవ కాశాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలి. వ్యవసాయ పథకాల ప్రారంభోత్సవాల సందర్భంగా సీఎం జగన్‌రెడ్డి చెప్పినప్పటికీ క్షేత్ర స్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.

నాణ్యమైనవి అందించడమే లక్ష్యంగా..

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించడమే లక్ష్యంగా అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఏళ్ళు గడుస్తున్నా.. యర్రగొండపాలెంలో కేంద్రంలో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ అందుబాటు లోకి రాలేదు. రెండేళ్ల క్రితం మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ల్యాబ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నేటికీ వినియోగం లోకి రాకపోవడంతో ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సివస్తుంది.

శంకుస్థాపన చేసి రెండేళ్లకు పైనే..

నియోజకవర్గ కేంద్రంలో రూ.82లక్షల వ్యయంతో నిర్మించే భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు తుదిదశకు చేరినా ల్యాబ్ మాత్రం ఇంకా అందుబాటులోకి రాలేదు. పూర్తిచేస్తే యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్ద దోర్నాల, పెద్దారవీడు మండలాల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది.

అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నిర్వహించేదిలా..

అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో ఒక టెక్నికల్ ఏఓ, ఇద్దరు ఏఈవోలు ఉంటారు. విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షలు చేయించు కోవాలంటే నేరుగా, లేదా వ్యవసాయ అధికారి ద్వారా కేంద్రానికి రావొచ్చు. పరీక్షలకు ఎలాంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదు. ఒక వేళ ప్రైవేటు విత్తనాల డీలర్లు పరీక్షల చేయించాలంటే ఒక్కో పరీక్షకు రూ.300నుంచి రూ.2,500 వరకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌కు కెమికల్స్, పరికరాలు రావాల్సి ఉంది.


నిర్మాణం పూర్తయిన అగ్రిటెక్ ల్యాబ్

నకిలీ విత్తనాల బారిన పడుతున్నాం

అగ్రి టెస్టింగ్ ల్యాబ్ అందు బాటులోకి రాక పోవడం తో వ్యాపా రులు చెప్పిన విత్త నాలు కొనుగో లు చేసి తీవ్రం గా నష్ట పోతు న్నాము. నష్టపోయిన తర్వాత విత్తనాలు అమ్మిన వ్యాపారులను ప్రశ్నిస్తే వాతావరణంలో మార్పుల కారణంగా దిగుబడి రాలేదని సాకులు చెబు తున్నారు. అదే ల్యాబ్ ఉంటే పరీక్షిం చుకున్న తర్వాతే నాటుకుంటాం.


కోట డేవిడ్
కొమరోలు రైతు

అందుబాటులోకి తీసుకు రావాలి

అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను వెంటనే రైతులకు అందు బాటులోకి తీసు కురావాలి. అసలే వర్షాలపై అధా రపడి మెట్ట పంటలు సాగు చేసి నష్టపోతున్న రైతులకు విత్త నాలు పరీక్షిం చుకునే ల్యాబ్ లేకపోవడంతో మరింత నష్టపోతున్నారు. ల్యాబ్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలి.


నక్కా తిరుపతయ్య,
రైతు, గంగపాలెం

త్వరలోనే ప్రారంభిస్తాం

అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. టెక్నికల్ సిబ్బందిని కూడా నియమించారు. ల్యాబ్‌కు అవసరమైన కొన్ని పరికరాలు కూడా వచ్చాయి. మరికొన్ని అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌కు అవసర మైన పరికరాలు, యంత్రాలు, ఇతర సామగ్రి రానున్నాయి. అవి రాగానే అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను రైతులకు అందుబాటులోకి తెస్తాం.


నీరజ, ఏడిఏ, యర్రగొండపాలెం

ప్రజాశక్తి
5
శుక్రవారం 22 సెప్టెంబర్ 2023

చంద్రబాబు అరెస్టుకు మూల్యం తప్పదు : ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ టిడిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్ష కొనసాగుతున్నాయి. 9వ రోజూ గురువారం టిడిపి బీసీ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వివిధ రకాల కుల వత్తుల పరికరాలను దీక్ష శిబిరం ఎదుట ప్రదర్శించారు. చంద్రబాబుకు అండగా ఉంటామంటూ వినూత్నమైన రీతిలో నిరసన తెలిపారు. నాయీ బ్రాహ్మణులు డోలు, సన్నాయి వాయిస్తూ మేము సైతం బాబుతో అంటూ నినాదాలు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహా రెడ్డి మాట్లాడుతూ టీడీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేయవచ్చుననే పిచ్చి భ్రమతో



రిలే దీక్షల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

చంద్రబాబును అరెస్టు చేసినట్లు తెలిపారు. అందుకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. దేశ విదేశాల్లో చంద్రబాబుకు లభిస్తున్న మద్దతే అందుకు నిదర్శనమని తెలిపారు. చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుకు న్యాయం వరకూ దీక్షలు కొనసాగిస్తామన్నారు. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దీక్షల్లో బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోరబోయిన గంగరాజు యాదవ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కసుమూరి మౌలాలి, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు చింతలపూడి తిరుపాలు, టిడిపి మండల అధ్యక్షుడు నంబుల వెంకటేశ్వర్లు యాదవ్, వీర నరసింహస్వామి, పాలూరి సత్యం, ఆర్‌వి.నారాయణ, యారగొర్ల రమేష్, కెవిఎస్.గౌడ్, హరికొండ ప్రసాద్, బత్తుల సత్యనారాయణ, దాసరి మాలకొండయ్య, డేగా నాగరాజు, బాల నారాయణ, వేమూరి బ్రహ్మయ్య, పిన్నిగ బాల కోటయ్య, గంజికొండ శ్రీను, చిలకపాటి లక్ష్మయ్య, చెరుకూరి కాశయ్య, కాసుల శ్రీరాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టులోని గురువాజిపేట సెక్టార్ కంచర్ల వారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మహోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిషోర్ బాలికలు, చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వైఎస్ఆర్ కిట్టు, పాలు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలతో లోగోను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్ వైజర్ పార్వతి మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం వస్తుందన్నారు. రక్తహీనతను అధిగమిం చేందుకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆకు కూరలు, కూరగాయలు, పప్పు ధాన్యాలలో అధికంగా ఐరన్, ప్రోటీన్లు ఉంటాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైఎస్ఆర్ కిట్టులో లభించే రాగి, సజ్జ, జొన్న గోధుమపిండి, గుడ్లు, బెల్లం, ఎండు ఖర్జూరం, పాలు,



మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్ వైజర్ పార్వతి

బలామతాన్ని సద్వినియోగం చేసు కోవాలన్నారు. వాటిలో కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, కొవ్వులు, పొటాషియం, కాల్షియం మెగ్నీషియం, ఐరన్ లాంటి పోషకాలు, విటమిన్లు ఉంటాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశు భ్రంగా ఉంచు కోవాలన్నారు. పచ్చదనం కోసం మొక్కలు నాటాలన్నారు. అనంరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు కళ్యాణి, శైలజ, రాణెమ్మ, ధనలక్ష్మి, గర్భిణులు బాలింతలు, కిషోర్ బాలికలు తదితరులు పాల్గొన్నారు.

98 డిఎస్‌సి అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలి

పొదిలి : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి హామీ మేరకు 98 డిఎస్‌సిలో అర్హులైన అందరికీ ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందని, కొందరికి ఇచ్చారని, మిలిగిన 2, 300 మందికి ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని పొదిలి, దర్శి ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులు కోరుతున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో పొదిలికి చెందిన గూడూరు సుదీప్ రాజు, దర్శికి చెందిన షేక్ అబ్దుల్ రసూల్ మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి రాక ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ 1998 డిఎస్‌సి అభ్యర్థులకు అందరికీ పోస్టింగ్ ఇవ్వాల్సి ఉండగా కొందరికి మాత్రమే ఇచ్చారన్నారు. మిగిలిన వారికి పోస్టింగులు ఇవ్వకుండా నిలుపుదల చేయడం భావ్యం కాదన్నారు. జిల్లా స్థాయి అధికారులు, కొందరు ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో కొందరికి మాత్రమే పోస్టింగ్ ఇచ్చారన్నారు. గత ఏడాది తమ ధ్రువపత్రాలను వెరిఫికేషన్ చేసి అందరికీ ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కొందరికే పోస్టింగ్ ఇచ్చారని మిగిలిన వారికి కూడా పోసింగ్ ఇచ్చిన ఆదుకోవాలని వారు కోరారు.

కలెక్టర్ ఆదేశాలు అమలయ్యేనా..?

పొదిలి : కలెక్టర్ ఆదేశాలు అమలు జరుగుతాయా లేదా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. పొదిలిలో బుధవారం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొదిలి మసీదు తోటలో లోఓల్టేజీ సమస్య ఉందని, దీంతో తాము ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు స్థానికులు కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. తమ ప్రాంతంలో 8 ఇనుప కరెంటు స్తంభాలు ఉన్నాయని, వర్షం పడినప్పుడు ఆ స్తంభాలకు విద్యుత్ సరఫరా అయి పిల్లలు విద్యుత్ షాక్‌కు గురవుతున్నట్లు మాజీ ఉప సర్పంచి జిలానీ కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. ప్రమాద భరితంగా ఉన్న విద్యుత స్తంభాలు, విద్యుత్ వైర్లను మార్చి నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదే శించారు. పొదిలమ్మ గుడి అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్లు లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే రహదారిని సిమెంటు రోడ్డుగా మార్చాలని కోరారు.

పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ

ప్రజాశక్తి - హనుమంతునిపాడు

నిరు పేదల కుటుంబాలకు అండగా ఉంటానని హనుమంతునిపాడు మండలం నల్లగండ్ల గ్రామ వైసిపి యువ నాయకులు బత్తుల నాగార్జున రెడ్డి తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆరు లక్షల సొంత నిధులతో పొలం కొనుగోలు చేశాడు. నల్లగండ్ల గ్రామంలోని నిరుపేద ఎస్‌పి కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రెండు సెంట్ల చొప్పున మొత్తం 50 మందికి ఎంపిపి గాయం సావిత్రి, గ్రామ సర్పంచి బత్తుల నారాయణమ్మ చేతుల




స్థల పత్రాలు అందజేస్తున్న ఎంపిపి, సర్పంచి

మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గాయం బలరాం రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ యక్కంటి శ్రీనివాసులు రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, వైసిపి నాయకులు ,సర్పంచులు ,అధికారులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండల పరిధిలోని ఉప్పలపాడు పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పున్నమ్మ ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యా యురాలు అవార్డును అందుకున్నారు. అందులో భాగంగా పున్నమ్మ, దంపతులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, పాఠశాల ప్రధానో పాధ్యాయుడు షేక్ నాయబ 'రసూల్, సర్పంచి వై.ప్రవీణ్‌కుమార్, గ్రామ పెద్దలు మల్లికార్జునరెడ్డి రత్నారెడ్డి,



పున్నమ్మ దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

బుడేసా, సిద్దు వెంకటరెడ్డి, చిన్న మాలకొండయ్య, సూర్యనారాయణరెడ్డి, శివారెడ్డి, ఉపాధ్యాయులు కమ్మనేతి వెంకటేశ్వర్లు, జెఎస్. ఆనంద్‌బాబు, ఎం.రామయ్య, ఖాజా రహమతుల్లా, ఆంథోని, ఎలికా శ్రీను పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - కనిగిరి

వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిం చాలని దర్శి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ అన్నారు. కనిగిరి– పామూరు రహదారిలో స్పీడ్ గన్స్‌తో వాహనాల వేగాన్ని పరిశీలించారు. నిబంధనలకు మించి వేగంగా ప్రయాణిస్తున్న వాహన చోదకులను గుర్తించి అపరాధ రుసుం విధించారు. 40 మంది వాహన దారులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్,



వాహనాల వేగాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సీట్ బెల్ట్‌ను ధరించాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో అన్ని రకాల పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆటల పోటీలకు పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులు

ఆటలు పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-దర్శి

స్థానిక ఆదర్శ పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో ఆటలు పోటలను ఎంఇఒలు కె. రఘురామయ్య, రమాదేవి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ హసీనాభాను, పిఇటిలు అంజిరెడ్డి, సాంబశివరావు, అనీల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

'గురజాడ'కు నివాళి

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మండల పరిధిలోని చెన్నపునాయుని పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మహాకవి గురజాడ వెంకట అప్పారావు జయంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట అప్పారావు చిత్ర పటా పూల మాలలు వేసి ఘన నివాళు లర్పించారు. గురజాడ రచించిన దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ గేయం , కన్యాశు ల్కం నాటకం గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల చేత పలు గేయాలు పాడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చాంద్ బాషా, పిఎంసి చైర్మన్ షేక్ రజాక్, ఉపాధ్యాయులు షరీఫ్, సిద్ధయ్య, మధుబాబు, లక్ష్మి పాల్గొన్నారు



అన్నదానం చేస్తున్న దాతలు

పామూరులో అన్నదానం

ప్రజాశక్తి-పామూరు

వినాయ చవితి పండుగ సందర్భంగా పామూరు పట్టణంలోని అంకాలమ్మ వీధిలో వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. ఆ విగ్రహం వద్ద గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంపిటిసి ఆకుపాటి వెంకటేష్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా నాయకులు గంగసాని హుస్సేన్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపిపి పువ్వాడి రాంబాబు, మహేంద్ర, గట్లా భాస్కరరెడ్డి, నల్లబోతుల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం

ప్రజాశక్తి - పొదిలి

స్థానిక విశ్వనాథపురంలోని వెంకటేశ్వర థియేటర్ నుంచి ప్రకాశ్ నగర్‌కు వెళ్లే రహదారిలో ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. అందులో భాగంగా నగర పంచాయతీ సిబ్బంది గురువారం ఆక్రమణ దారులతో మాట్లాడారు. రెండు రోజుల్లో ఆక్రమణలు తొలగించకపోతే తామే తొలగిస్తామని టౌన్ ప్లానింగ్ అధికారి మల్లికార్జునరావు హెచ్చరించారు. పొదిలిలో బుధవారం జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రహదారి ఆక్రమణలపై స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా నగర పంచాయతీ అధికారులు ఆక్రమణ తొలగింపు శ్రీకారం చుట్టారు. చెరువులు, కాలువల ఆక్రమణలు తొలగించని అధికారులు రహదారి ఆక్రమణలు తొలగించేందుకు ఎందుకు తొందర పడుతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



విలేకర్ల సమావేశంలో మాల మహానాడు నాయకులు

వర్గీకరణను వ్యతిరేకిస్తూ 24న దీక్షలు

ప్రజాశక్తి - చీరాల : విజయవాడలో ఈనెల 24న మాల యువసేన ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలను జయప్రదం చేయాలని మాల యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు చప్పిడి వెంగళరావు కోరారు. పట్టణంలోని పేరాలలో మాల యువసేన ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం గురువారం నిర్వహించారు. ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్లు కాపాడు కొనేందుకు, ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించేందుకు విజయవాడలో చేపట్టిన మహా దీక్షకు మాల సోదరులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ అనేది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. మాదిగ సోదరులలో కొంతమంది రాజకీయ లబ్ధి కోసం వర్గీకరణను తెస్తున్నారని అన్నారు. వాస్తవానికి అసాధ్యమైన ఎస్సి వర్గీకరణ అంశాన్ని అగ్ర నాయకులకు తొత్తులుగా వ్యవహరించేందుకు మాదిగలు ముందుకు తెస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపే పార్టీని పూర్తిగా మాలలు వ్యతిరేకించాలని కోరారు. ప్రస్తుతం బిజెపి వర్గీకరణకు పరోక్షంగా సహకరిస్తుండడం గమనిస్తున్నామని అన్నారు. బిజెపికి మాలలు గుణపాఠం చెబుతారన్నారని అన్నారు. సమావేశంలో మాల యువసేన రాష్ట్ర అధ్యక్షులు చైతన్య, మాలభేరి నాయకులు ప్రీతం, కిషోర్ పాల్గొన్నారు.



తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నేతలు

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - చీరాల : స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఎదుట దళిత బహుజన పార్టీ ఆధ్వర్యంలో తోటవారిపాలెంలో ఎస్సీ స్మశాన వాటికకు స్థలాన్ని వెంటనే కేటాయించాలని ఆందోళన చేశారు. డిప్యూటీ తహసిల్దార్ సురేష్ బాబుకు వినతి పత్రం అందజేశారు. సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలాని మాట్లాడుతూ గ్రామంలో 30ఏళ్లకుపైగా నివాసం ఉంటున్న ఎస్సీలకు స్మశాన వాటిక లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దహన సంస్కారాలు ఎక్కడ నిర్వహించాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. కొంత మంది చేసేది లేక ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న బైపాస్ వద్ద దహన సంస్కారాలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే సమస్యపై స్పందించి తోటవారిపాలెం ఎస్సీలకు అందుబాటులో స్మశాన స్థలం కేటాయించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-కొత్తపట్నం

మండలంలోని అల్లూరు గ్రామము లో రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి,అల్లూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో లో 30 సెంట్ల విస్తీర్ణం లో సంవత్సరం పొడువునా ఆకుకూరలు కూరగాయలు పండే విధంగా 15 నుంచి 30 వివిధ రకాల ఆకు కూరలు, కూరగాయలు లతో ఏ.టి.యం. మోడల్ ను స్కూల్ ఆవరణలో వేశారు. సుభాషిణి మాట్లాడుతూ ప్రస్తుత తరుణం లో ఆకుకూరలు, కూరగాయలు ప్రకృతి వ్యవసాయ విధానం లో సాగు చేసినట్లు అయితే సంవత్సరం పొడవునా కూరగాయలు ఆకుకూరలు పండుతాయని అంతే కాకుండా స్కూల్ ఆవరణలో పండించే ఆకు కూరలు పూర్తిగా పకృతి వ్యవసాయము ద్వార పండించడం జరుగుతుందన్నారు. ఇలా సాగు చేసిన పంటలు రుచికరంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకున్న వాళ్ళం అవుతామని తెలియజేశారు. పూర్తిగా పకృతి వ్యవసాయము ద్వార పండించడం జరుగుతుంది అని ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు తెలియ జేశారు. ఇలాంటి మోడల్స్ ను ప్రతి ఒక్కరూ వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పకృతి వ్యవసాయ సిబ్బంది వికాస్ రెడ్డి, బ్రహ్మయ్య , నరసింహులు, రెడ్డిప్ప, ఇందిర, ఐ సి ఆర్ పి లు శ్యాంబాబు రాజశేఖర్ పాల్గొన్నారు.

సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాపారావు

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్రంలో సర్పంచుల సమస్యలు పరిష్కారం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎపి సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలకలపూడి పాపారావు అన్నారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య కార్యాలయంలో జరిగిన సర్పంచుల సంక్షేమ సంఘం జిల్లా విస్తృ స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి కర్లపాలెం మండలం పెదపులుగు వారిపాలెం పంచాయతీ సర్పంచి అక్కల శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. పాపారావు మాట్లాడుతూ భవిష్యత్తులో సర్పంచులకు హక్కులు, విధులు కల్పించకపోతే రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని అన్నారు. సర్పంచుల పట్ల ప్రభుత్వం సవితితల్లి ప్రేమ చూపుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా సర్పంచుల సమస్యలు తీర్చడంలో



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు పాపారావు

విఫలమైందన్నారు. భవిష్యత్తులో పార్టీలకతీతంగా సర్పంచులు ఐక్యమత్యంగా ఉద్యమిస్తామని అన్నారు. ఇప్పటికైనా సిఎం వైఎస్ జగన్ చొరవచూపించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక పంచాయితీల్లో వర్షాకాలంలో బ్లీచింగ్ కొట్టించడానికి కూడా నిధులు లేవని అన్నారు. సర్పంచుల గౌరవ వేతనం రూ.3వేల నుండి రూ.15వేలకు పెంచాలని కోరారు. మైనర్ పంచాయతీల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే భరించాలని అన్నారు. పంచాయతీలో పనిచేసి గ్రీన్ గార్డ్, గ్రీన్ అంబాసిడర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే జీతాలు ఇవ్వాలని అన్నారు. సచివాలయాల్లో వచ్చే ఆదాయాలను పంచాయతీలకు జమ చేయాలని కోరారు. సచివాలయా వ్యవస్థపై సర్పంచులకు అజమాయిషి ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అఖిల భారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ స్వాతంత్యానంతరం ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వాలు వచ్చాక సర్పంచులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం ఉన్న 29అంశాలను అమలు చేయడంలో విఫలమయ్యాయన అన్నారు. కేరళ ప్రభుత్వం తరహాలో పంచాయతీలకు నేరుగా నిధులు ఇస్తే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెండింగులో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు.

సర్పంచుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

బాపట్ల జిల్లా సర్పంచుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా నిజాంపట్నం మండలం అడవులదీవి సర్పంచి శొంఠి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కర్లపాలెం మండలం పెద పులుగువారిపాలెం సర్పంచి అక్కల శ్రీనివాసరెడ్డితోపాటు మరో 15మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి టి కృష్ణమోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉయ్యూరు అప్పరెడ్డి, దాది రాజ్యలక్ష్మి సుబ్బారావు, మబ్బు సుధాకర్, సర్పంచుల సంక్షేమ సంఘం నాయకులు మేకతోటి శ్రీకాంత్, రుద్రపాటి బుజ్జిబాబు, పిల్లి బాబ్జి, వై అశ్విని, జి వెంకటేశ్వరావు, మద్దిరాల వందనం, బి హనుమాన్ పాల్గొన్నారు.



నూతన అధ్యక్షులు శ్రీనివాసరావుకు ఘన సన్మానం

న్యాయమూర్తులకు ఘన సన్మానం

- పదోన్నతిపై మార్కాపురం వెళ్లనున్న ఎం సుభవాణి
- పదోన్నతిపై అనంతపురం వెళ్లనున్న బి సాధుబాబు
- బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

ప్రజాశక్తి - బాపట్ల

పదోన్నతిపై అనంతపురం జిల్లా 8వ అదనపు జిల్లా జడ్జిగా వెళ్తున్న బాపట్ల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బి సాధుబాబును బార్ అసోసియేషన్ అధ్యక్షులు భీమా లీలా కృష్ణ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లీలా కృష్ణ మాట్లాడుతూ నిర్వహణలో జడ్జి సాదుబాబు తీసుకున్న నిర్ణయాలు ఎంతో సత్ఫలితాలు ఇచ్చాయన్నారు. జడ్జి సాదు బాబు మాట్లాడుతూ బార్ అసోసియేషన్ సభ్యులు అందించిన సహకారం, ఆదరాభిమానాలు ఎల్లప్పుడూ మరువలేనని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ జి వాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ జి రుక్మిణి పాల్గొన్నారు.



జడ్జి సాధుబాబును సన్మానిస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక కోర్టులో సీనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తూ పదోన్నతిపై బదిలీ అయిన ఎం సుభవాణిని న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొల్లా నరేంద్ర కుమార్ అధ్యక్షతన సత్కార సభ నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన కొద్ది నెలలలోనే పదోన్నతి పొంది ప్రకాశం జిల్లా మార్కాపురం 6వ అదనపు జిల్లా జడ్జిగా నియమితులు కావటం అభినందనీయమని కొనియాడారు. జూనియర్ సివిల్ జడ్జి పి శాంతి, న్యాయవాదులు రావి సత్యనారాయణ, చాగంటి సుబ్బారావు, పోతిన సురేంద్ర, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, రావి రమేష్, వెంగలశెట్టి తిరుమలరావు, ఓ గోవిందరాజు పాల్గొన్నారు.



జడ్జి ఎం శుభవాణిని సన్మానిస్తున్న న్యాయవాదులు



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రేపల్లె

రైతులకు మెరుగైన సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ అన్నారు. వ్యవసాయ శాఖ, పంచాయతీరాజ్ సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని క్షేత్రస్థాయి సిబ్బంది సెప్టెంబర్ 30లోపు ఈ పంట నమోదు, ఈకేవైసీ 100శాతం పూర్తి చేయాలన్నారు. పీఎం కిసాన్ నగదు బదిలీకి సంబంధించి రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేసి ఉండాలని అన్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పిఎం కిసాన్ రూ.2వేల నగదు ఖాతాలో జమ కాదని అన్నారు. ఖరీఫ్ 2023 సంబంధించి పంట నమోదు చేయించుకున్న రైతులు తమ పంట నమోదు రసీదు ఒకటి రెండు రోజుల్లో ఆర్‌బికెలో అందుబాటులో ఉంటుందన్నారు. పంట నమోదు రసీదు అనేది వరి ధాన్యం కొనుగోలు, ఇతర పంట నష్ట పరిహారం, పంట భీమాకు అన్ని విధాల ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడిఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్, ఎఒ వాగోలు బుష్, ఎంపీడీవో శివపార్వతి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యువతులను కాపాడిన పోలీసులు

మెరైన్ పోలీసులను అభినందించిన అధికారులు, పర్యాటకులు

ప్రజశక్తి - చీరాల

వాడరేవు సముద్ర తీరంలో వినాయక నిమజ్జానికి వచ్చి అలలు తాకిడి కొట్టుకొని పోతున్న నలుగురు యువతలను మెరైన్ వెంటనే స్పందించి రక్షించారు. మెరైన్ ఎస్ఐ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం మెరైన్ సిఐ కె శ్రీనివాసరావు పర్యవేక్షణలో తమ సిబ్బంది సిబ్బంది, లా అండ్ ఆర్డర్ స్టాఫ్ డ్యూటీలో వుండగా చిలకలూరిపేటకు చెందిన కొంతమంది గణేష్ నిమజ్జనం నిమిత్తం సముద్రంలో స్నానం చేస్తుండగా ఒక్కసారిగా సముద్ర అలల ఎక్కువగా వచ్చాయి. దీంతో తీరంలోకి జారిపోతున్నా నలుగురు మహిళలు చేతులు పైకి లేపి కేకలు వేశారని అన్నారు. అప్పటికే తీరంలోకి కొట్టుకుపోవటం గమనించిన మెరైన్ సిబ్బంది వెంటనే స్పందించారు. తీరం లోనికి వెళ్లి వారిని కాపాడి ఒడ్డుకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా హెచ్‌సి సైకం ప్రసాద్, ఎస్ చిరంజీవి, పిసి ఎ నరేష్, హెూంగార్డు వి పోతురాజు వెంటనే స్పందించి వారిని రక్షించి ప్రదమ చికిత్స అందించారు. వారిని బంధువులకి అప్పగించారు. తీరంలో కొట్టుకుపోతున్న మహిళలను చాకచక్యంగా రక్షించి బంధువులకు అప్పగించిన మెరైన్ సిబ్బందిని అధికారులు, పర్యటకులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలలు తాకిడి రోజు రోజుకి పెరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో నిమజ్జనానికి వచ్చిన భక్తులు పోలీసులకు సహకరిస్తూ నిర్ణయించిన పరిధిలోనే సముద్ర స్థానాలు చేయాలని సూచించారు. ఆనందం కోసంమని పోయి ప్రమాదానికి గురికావద్దని సూచించారు.



మెరైన్ పోలీసు సిబ్బందిని అభినందిస్తున్న పర్యాటకులు

కొనసాగుతున్న నిరాహార దీక్షలు

-బాపట్ల వద్ద సాగర తీరంలో బాబు సైకత శిల్పం
- భట్టిప్రోలులో పాల్గొన్న నక్క ఆనందబాబు
- కారంచేడులో పెద్ద సంఖ్యలో మహిళల దీక్షలు
- అద్దంకిలో కొనసాగుతున్న దీక్షలు


బట్టిప్రోలు దీక్షలో నక్క ఆనందబాబు


అద్దంకి దీక్షల్లో తెలుగు మహిళలు


కారంచేడు దీక్షల్లో తెలుగు మహిళలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో నిరాహార దీక్ష చేశారు. బీసీ, రైతు విభాగాల ఆధ్వర్యంలో గురువారం జరిగిన దీక్షకు పెద్ద ఎత్తున కార్యకర్తలు, మహిళలు హాజరయ్యారు. దీక్షా శిభిరం వద్ద నలుపు, పసుపు రంగులతో దద్దరిల్లింది. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా మాట్లాడారు. అవినీతితో అక్రమాస్తులు కూడబెట్టిన సిఎం జగన్‌రెడ్డి తనపై ఉన్న కేసులను మాఫీ చేసుకోవడానికి, రాను ఎన్నికలలో ఓడిపోతామనే భయంతోనే అవినీతి మచ్చలేని చంద్రబాబును అక్రమ కేసులతో అరెస్టు చేయించారని ఆరోపిం చారు. ఎన్ని కుట్రలు చేసినా టిడిపి విజయాన్ని ఆపలేరని అన్నారు. కార్యక్రమంలో రేపల్లె మాజీ ఎంఎల్ఎ ముమ్మనేని వెంకట సుబ్బయ్య, బట్టు మల్లికార్జునరావు, సిరాజుద్దీన్, కనపర్తి సుందర్రావు, వాకా శేషబాబు, నాయకులు మైనేని మురళీకృష్ణ, జొన్నలగడ్డ విజయబాబు, కనగాల మధుసూదన్ ప్రసాద్, నూతక్కి దినకర బాబు, మాచర్ల నాగరాజు, చందోలు పృథ్వీలత, మాజీ ఎంపీపీ వాకా సుధ పాల్గొన్నారు.

అద్దంకి : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా 9వ రోజు రిలే నిరాహారదీక్ష గురువారం చేశారు. పట్టణంలోని 5వ వార్డు టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు దీక్షలో కూర్చున్నారు. తెలుగు యువత పట్టణ అధ్యక్షులు వడ్డవల్లి పూర్ణచంద్రరావు, పొన్నలూరి కిరణ్ కుమార్, రావులపల్లి వెంకట్రావు, బాచిన వెంకట సుబ్బారావు, చిరుమామిల్ల మాధవరావు, తెలప్రోలు ఆంజనేయులు, గాలి నారాయణ, వడ్లవల్లి గోపి, కూనంనేని ఆంజనేయులు, దండా మదనయ్య, కొండపల్లి నాగేశ్వరరావు, కొండలు, ఎనికపాటి సుబ్బారావు, మక్కెన వెంకటేశ్వర్లు, యడవల్లి ఆంజనేయులు, దార్ల శ్రీనివాసచారి, సయ్యద్ ఖాసింవలి, నర్రా గోపాల్, గుంజి వరప్రసాద్, కుంచాల వరప్రసాద్, కావూరి నాగేశ్వరరావు, నల్లపోతు రంజిత్, అంజయ్య, షేక్ ఆదాంవలి, పొత్తూరి శివక్రిష్ణ, గుంటూరి శ్రీరామ్, బాచిన వీరంజనేయులు, మంగమూరి సుబ్బారావు, పోకూరి నరసింహారావు, మల్లాది సుబ్బరామయ్య, నాగబోతు పార్వతి, కరి సరోజిని, తమ్మవరపు ప్రమీల పాల్గొన్నారు.

కారంచేడు : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ రిమాండ్ ఎత్తివేయాలని కోరుతూ స్థానిక టిడిపి కార్యాలయంలో 13వ రోజు ఆందోళన నిర్వహించారు. మహాత్మా న్యాయం ఎక్కడంటూ ప్లేకార్డులు ప్రదర్శించారు. ఎఎంసి మాజీ చైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి నాయకులు కంభంపాటి నరేంద్ర, పాతూరి ఆదిలక్ష్మి, పోతిన వెంకటేశ్వర్లు, తాళ్లూరి అనిల్ కుమార్, షేక్ కాలిషా వలి, కొల్లా భాస్కరరావు, గద్దె సబ్బయ్య పాల్గొన్నారు.

చీరాల : చంద్రబాబుకు రిమాండ్ విధించిన వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని టిడిపి ఇన్చార్జి ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన రిలే దీక్షలు గురువారంకు 9వ రోజుకు చేరాయి. దీక్షలకు టిడిపి రాష్ట్ర కార్యదర్శులు నాతాని ఉమా మహేశ్వరరావు, సలగల రాజశేఖరబాబు, షేక్ యాసిన్, ఐటీడీపీ జిల్లా అధ్యక్షులు మానవ శ్రీనివాసరావు, రావిపాటి సంధ్య, మాజీ ఎంపిటిసి శిద్ధి బుచ్చేశ్వరరావు, సజ్జా హేమసుందర్రావు, ఉప్పుగంటి సాంబశివరావు, సజ్జ రేణుకకుమార్, పృథ్వి వెంకటేశ్వర్లు, పృథ్వి లలితమోహన్, సజ్జ సూర్యబాలానందం, పృథ్వి వెంకటశివయ్య, సజ్జ రాజశేఖర్, పృథ్వి హేమఅర్జున్, సజ్జ వెంకటేశ్వర్లు, సజ్జ శరత్ బాబు, కర్ణ బంగారి, ఆయిల జస్వంత్, పసుమర్తి బాలసుబ్రమణ్యం, చప్పట సత్యవేణి, పెసల పద్మ, మాడా శేషారత్నం, చందన నాగమణి, సబ్జా విజయ, పి హేమలత పాల్గొన్నారు.

సాగర తీరంలో బాబు సైకత శిల్పం

ప్రజాశక్తి - బాపట్ల



సాగరతీరంలో చంద్రబాబు సైకత శిల్పం

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అక్రమ అరెస్టుని నిరసిస్తూ చంద్రబాబుకు సంఘీభావంగా టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో పాండురంగాపురం సము ద్రతీరంలో చంద్రబాబు సైకత శిల్పాన్ని ఏర్పాటు చేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి చింతకాయల విజయ్ నిర్వహణలో ఈ సైకత శిల్పాన్ని ఏర్పాటు చేసి సంఘీభావం తెలిపారు.


నగదు అందజేస్తున్న కన్వీనర్ నూర్‌మహ్మద్

బీమా నగదు అందజేత

ప్రజశక్తి - చీరాల : మండలంలోని ఈపురిపాలెం పంచాయతీ లోని 3వ సచివాలయం పరిధిలో పీర్ల చావడి వద్ద నివాసం ఉంటున్న షేక్ హుస్సేన్ అనారోగ్యంతో మృతి చెందారు. అయితే గురువారం ఆ కుటుంబానికి మట్టి ఖర్చుల కింద వైయస్ ఆర్ భీమా కింద నామినికు షేక్ జహీరున్ కు రు.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ షేక్ నూర్ మహమ్మద్, మండలం మాజీ కో ఆప్షన్ సభ్యుడు షేక్ మస్తాన్, వెల్ఫేర్, అందె ప్రవీణ్ వాలంటీర్ షేక్ ఎంఎన్ షరీఫ్, వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొనారు.

జడ్జి శుభవాణికి సత్కారం

ప్రజాశక్తి - చీరాల : పర్చూరు సబ్ జడ్జిగా భాద్యతలు నిర్వహిస్తున్న ఎం శుభవాణి పదోన్నతిపై జిల్లా అదనపు జడ్జిగా మార్కాపురం వెళుతున్న సందర్భంగా చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరవ రమేష్ గురువారం సన్మానించారు.


జడ్జి ఎం శుభవాణిని సత్కరిస్తున్న జి రమేష్

'ఆయుర్వేద వైద్యశాల' నూతన భవనానికి నిధులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గ్రామంలో గత 75ఏళ్లుగా సేవలందించిన ఆయుర్వేద వైద్య శాల శిథిలవస్తుకు చేరి నిరుపయోగంగా మారిందనే సమస్యపై ఈనెల 18న "ఆయుర్వేద వైద్యశాలపై అధికారుల నిర్లక్ష్యం" అనే శీర్షికతో ప్రజాశక్తిలో కదనం వెలువడింది. దీనికి అధికారులు స్పందించారు. ఆయుష్ రాష్ట్ర కమిషనర్ ఎల్ రాజేంద్ర కుమార్ తన బృందంతో వైద్యశాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈ వైద్యశాల పూర్తిగా శిథిలావస్థకు చేరిందని అన్నారు. దీనిని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌గా ఏర్పాటు చేసేందుకు రూ.30లక్షల నిదులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నిధులతో నూతన భవనం ఏర్పాటు చేసి యోగా శిక్షణ ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలో 110ఆయుర్వేద వైద్యశాలలను ఆధునికరిస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క వైద్యశాలకు రూ.5లక్షల చొప్పున మంజూరు చేసి పూర్తి హంగులతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. భట్టిప్రోలులోని ఈ వైద్యశాలను పూర్తి హంగులతో ఆధునీకరించటమే కాక ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా మార్చుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ వై శేఖర్, అకౌంటెంట్ భుజంగరావు, కన్సల్టెంట్ డాక్టర్ రంగనాథ్, డాక్టర్ పద్మజ ఉన్నారు.


ఆయుర్వేద వైద్యశాలను పరిశీలిస్తున్న కమిషనర్ రాజేంధ్రకుమార్

నేతల స్వార్ధంతో రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం చేసిన పని వాహనదారులు, ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండలంలోని వెల్లటూరు - చిన్నారేవు నుండి కొల్లూరు మండలం కిష్కిందపాలెం వరకు రహదారి వెంట ఇరువైపులా ప్రోక్లైన్లతో మార్జిన్లకు మట్టిని నింపారు. కొద్దిపాటి వర్షానికే మట్టి అంతా కారి రహదారిపైకి చేరి వాహనాలు జారిపోతున్నాయి. కింద పడిపోయే పరిస్థితి నెలకొంది. గత కొన్నేళ్ళుగా కృష్ణా నది నుండి జువ్వలపాలెం సమీపంలో బుసక మట్టిని జాతీయ రహదారి 216నిర్మాణానికి పెద్ద ఎత్తున తోలుతున్నారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు జాతీయ రహదారి గుత్తేదారినితో కొమ్మక్కై నిత్యం వందల సంఖ్యలో ఈ రహదారిపై లారీలు తిరుగుతుండడంతో రహదారి మార్జిన్లు దెబ్బతిన్నాయి. దీంతో జాతీయ రహదారి గుత్తేదారి వద్ద నుండి కొంత సొమ్మును రాబట్టుకొని నాయకులు రహదారి ప్రక్కనే ఉన్న ఒంద్రు మట్టిని తీసి మార్జనులకు నింపారు. దీంతో ఆ మట్టి రహదారిపైకి చేరి వర్షానికి వాహనాలు తిరగబడుతున్నాయి. సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు సైతం మామూళ్ల పుచ్చుకొని ఒంద్రు మట్టిని మార్జిన్ లకు నింపకూడదని తెలిసి కూడా చూస్తూ ఉండిపోయారనే ఆరోపణలు ఉన్నాయి. తక్షణమే రహదారిపైకి చేరిన బంకమన్నును తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపై బంకమట్టిచేరి వాహనాలు జారిపోతున్న దృశ్యం


జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంపిటిసి తాంద్ర

ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - కర్లపాలెం : సిఎం వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచే ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని నల్లమోతువారిపాలెం ఎంపిటిసి, మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అద్యక్షులు తాంద్ర సాంబశివరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటిం టికీ వెళ్ళి కరపత్రాలు పంచుతూ ప్రజలకు అందించే వైద్య సదుపాయాలను వివరించారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆసు పత్రలను ఆధునికరించి, వైద్య సేవలను మెరుగుపర్చారని అన్నారు. వైద్య సేవలను ప్రజల ముందుకు చేర్చారన్నారు. పేదల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని ముందుగానే వైద్య సేవలు అందించేందుకే ఈ పదకం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నల్లమోతు వారిపాలెం పంచాయతీ సెక్రటరీ పి వెంకటేశ్వరరావు, ఎఎన్ఎం రత్నమాల, విలేజ్ హెల్త్ క్లినిక్ ఆఫీసర్ అనూష పాల్గొన్నారు.


పౌష్టికాహార ర్యాలీలో విద్యార్థులు, అంగనవాడీ కార్యకర్తలు

పోషకాహార అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - యద్దనపూడి : మండలంలోని జాగర్లమూడి గ్రామంలో పోషకాహార మాసోత్సవాలలో భాగంగా ఐడిఎస్ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎఎస్ ఉన్నత పాఠశాల నందు మానవ హారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ సుజాత మాట్లాడుతూ పిల్లలకు పోషక ఆహారం అందించాలని అన్నారు. విద్యార్థులతో పోషకాహార నినాదాలు చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బెల్లం శ్రీనివాసరావు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.


పౌష్టికాహార ర్యాలీలో విద్యార్థులు, అంగనవాడీ కార్యకర్తలు

పర్చూరు : మండలంలోని ఎడారిపల్లిలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఎంపీడీవో వి ప్రద్యుమ్న కుమార్ మాట్లాడుతూ గ్రామంలో గర్భవతులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార కిట్లను ఉపయోగించుకొని రక్తహీనత లేకుండా ఉండాలని కోరారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన గ్రామాల్లో దొరికే చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు, సజ్జలు ఎక్కువగా వాడాలని సూచించారు. 0నుంచి 5ఏళ్లలోపు పిల్లలందరూ ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచి బిరుదు నాగేంద్రమ్మ, పంచాయతీ సెక్రటరీ కె శ్రీనివాసులు, సూపర్వైజర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

తహశీల్దారుగా సుజాత

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

నూతన తహశీల్దారుగా కె సుజాత గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల కలెక్టరేట్ లో ల్యాండ్ సెక్షన్ సూపరెంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా మార్టూరు తహశీల్దారుగా వచ్చారు. ఇప్పటివరకు తహశీల్దారుగా పనిచేసిన పొన్నగంటి సురేష్ బాబు బాపట్ల కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నూతన తహశీల్దారు కె సుజాత తెలిపారు.


తహశీల్దారు సుజాత



లబ్ధిదారులతో మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఇడి

అర్హులందరికీ 'జగనన్న చేదోడు'

బీసీ కార్పొరేషన్ ఇడి వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్ : అర్హులైన వారందరికీ జగనన్న చేదోడు పథకం అందేలా చర్యలు తీసుకుంటున్నామని బీసీ కార్పొరేషన్ ఎగ్జికూటివ్ డైరెక్టర్ ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. నగరంలో అత్యధికంగా చేదోడు అర్జీలు పెండింగ్‌లో ఉన్న శివప్రసాద్‌కాలనీ, ఇస్లాంపేట ప్రాంతాలలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్లాంపేట సచివాలయం పరిధిలో 97మంది చేదోడు పథకం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వారిలో ముగ్గురు అర్జీలను మాత్రమే విచారించాల్సి ఉందన్నారు. శివప్రసాద్ కాలనీ సచివాలయం పరిధిలో 99 మంది దరఖాస్తు చేసుకుంటే అందులో మరో ముగ్గురు అర్జీలను విచారించాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా ఈపాటికే జగనన్న చేదోడు పథకం ద్వారా లబ్ధిపొందిన పలువురు లబ్ధిదారులతో ఇడి మాట్లాడారు. చేదోడు పథకాన్ని ఏ విధంగా వినియోగించుకున్నారనే వివరాలను ఆరా తీశారు. చేదోడు పథకం కింద లబ్ధిపొందిన వారు సంతోషం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరలోనే పరిష్కరిస్తామని ఇడి వెంకటేశ్వరరావు తెలిపారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న మున్సిపల్, సచివాలయ సిబ్బంది

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : కమిషనర్

ఒంగోలు సబర్బన్ : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. స్వచ్ఛతాహిసేవ కార్యక్రమంలో భాగంగాకొత్త కూరగాయాల మార్కెట్ ప్రాంతంలో పారిశుధ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది గురువారం ప్రదర్శన నిర్వహించారు. మార్కెట్‌లోని వ్యాపారులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆప్రాంత ప్రజల చేత స్వచ్ఛతాహిసేవకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 నుంచి వచ్చేనెల 2 వరకూ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 24వ డివిజన్ కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ, కార్పొరేషన్ ఇంజినీర్ జానీ, హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ ఎపిచ్చయ్య, ఇన్‌స్పెక్టర్ బాబ్జీ, డిఇఇ గణపతి పాల్గొన్నారు.

ఆరోగ్యసేవలు పరిశీలన....

జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం ద్వారా నగరంలోని పలు ప్రాంతాలలో మెడికల్ సిబ్బంది అందిస్తున్న సేవలను కమిషనర్ వెంకటేశ్వరరావు పరిశీలించారు. గోపాలనగర్, ఇస్లాంపేట,శివప్రసాద్ కాలనీ పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు అందుతున్న సేవలను ప్రత్యక్షంగా చూశారు.



ఆరోగ్యసేవలు పరిశీలిస్తున్న కమిషనర్

ప్రభుత్వ భూములకు రక్షణ కరువు

- నిరుపయోగంగా జగనన్న ఇళ్ల స్థలాలు
- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి సంతనూతలపాడు

ప్రభుత్వ భూములకు రక్షణ కరువైందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు తెలిపారు. ప్రకాశంను వెనుకబడిన జిల్లాగా గుర్తించాలని, జిల్లా అభివద్ధికి పదివేల కోట్లు కేటాయించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట-పాదయాత్ర బృందం 12 రోజూ గురువారం సంతనూతలపాడు మండలపరిధిలోని గుమ్మళంపాడు, ఎనికపాడు గ్రామాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు పాదయాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. తమ గ్రామాల్లోని సమస్యలను పాదయాత్ర బందం దష్టికి తీసుకొచ్చారు. గుమ్మళంపాడు గ్రామంలో బీసీలు, పాముల కులానికి చెందిన వారు నివసిస్తున్న ప్రాంతంలో వీధిలైట్లు, సైడు కాలువల సమస్య తీవ్రంగా ఉందని అర్జీ రూపంలో బందం దష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ పేదలకు జగనన్న ఇళ్ల స్థలాల పేరుతో అనేక ప్రాంతాల్లో ఊరికి దూరంగా నిరుపయోగంగా ఉన్న ప్రాంతాల్లో ఇళ్ల స్థలాల కొనుగోలు చేసి ఇచ్చారన్నారు. ఇనగలేరు పక్కన ఉన్న కాలనీ లో ఒక్కరు కూడా బేస్ మట్టం వేయలేదన్నారు. చిల్ల చెట్లు మొలిసి ఉపయోగం లేకుండా ఉందన్నారు. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి రైతుల దగ్గర భూమి కొని అధికార పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు లబ్ధి పొందారని చెప్పారు. ప్రజలకు మాత్రం దీనివల్ల ఎలాంటి ఉపయోగం లేదన్నారు. సంతనూతలపాడు మండలంలో అసైన్డ్, పోరంబోకు భూములను అధికార పార్టీ నాయకులు కొల్లగొట్టడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అధికారులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే తాహశీల్దారుపై భౌతిక దాడికి తెగబడ్డారనీ పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. పాదయాత్రలో జివి. కొండారెడ్డి ,కె.రమాదేవి, పి.కల్పన, బి.రఘురాం, వి.బాలకోటయ్య,డిఎంకె.రఫీ, కె.మాల్యాద్రి, వెల్లంపల్లి ఆంజనేయులు ,సిహెచ్. వినోద్, సిపిఎం సంతనూతలపాడు మండల కార్యదర్శి బంకా సుబ్బారావు, నాయకులు వెంకటేశ్వర్లు, ఎన్.వి. నరసింహం, యు.రాజు, బి.పద్మ , మాలతి,ఈదర సుబ్బారావు పాల్గొన్నారు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న పాదయాత్ర బృందం



పాదయాత్రలో పాల్గొన్న సిపిఎం నాయకులు , ప్రజలు

'జలజీవన్'లో అక్రమాలు

- కుళాయి కనెక్షన్ ఉన్న వారికి మళ్లీ కనెక్షన్
- కొందరి రెండేసి కనెక్షన్లు
- నిధులు స్వాహా
- పట్టించుకోని ఉన్నతాధికారులు



ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

గ్రామాల్లోని ప్రజలకు ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేసి ఉచితంగా తాగునీరు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జలజీవన్ పథకం అమలు చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా జరుగుతోంది. మండల పరిధిలోని ఉప్పుగుండూరు పంచాయతీలో ప్రజలకు తాగునీరు అందిం చేందుకు జలజీవన్ పథకం ద్వారా రూ. 55 లక్షలు కేటాయించారు. ఈ పథకం ఉద్దేశ్యం ప్రకారం కుళాయి లేని వారికి ఉచితం కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేసి తాగునీరు అందించాల్సి ఉంది. అయితే కుళాయిల మంజూరులో అవతవకతకలు జరిగినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ సభ నిర్వహించి జలజీవన్ పథకం ద్వారా ఎంత మందికి ఉచితంగా కుళాయి కనెక్షన్లు ఇవ్వవచ్చు అనే విషయాన్ని బహిర్గతం చేయాల్సిఉంది. ఆ తర్వాత పంచాయతీ పాలక వర్గం తీర్మానం చేయాల్సి ఉంది. అయితే అలా జరగలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జలజీవన్ పథకం ద్వారా 53 మందికి కుళాయిలు మంజూరు చేసామని జాబితా తయారు చేశారు. దీనిపై ఈనెల 19న పంచాయతీ పాలవర్గంతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కుళాయిల మంజూరుపై ఎలాంటి తీర్మానం చేయలేదు. తీర్మానం లేకుండా కుళాయి కనెక్షన్లు ఎలా మంజూరు చేస్తారని ప్రజలు చర్చించుకుంటున్నారు. సమావేశంలో దాదాపు రెండు గంటలపాటు వాదోపవాదనలు జరిగాయి. దీంతో అసలు విషయం బయటకు వచ్చింది. అది ఆనాట ఈనోట పడి ప్రజలకు తెలిసింది బినామీ పేర్లతో నిధులు స్వాహ చేసినట్లు తేటతెల్లమైంది. ఈ విషయం పెద్ద ఎత్తున దుమారం రేగింది. ఓ ప్రక్క ప్రభుత్వాలు పేద. బలహీన వర్గాల అభివృద్ధి తమ ధ్యేయమని పదేపదే చెబుతున్నాయి. గ్రామాల్లో అందుకు భిన్నంగా ఉంటోంది. జలజీవన్ పథకం ఎక్కువ శాతం పేద, బలహీన వర్గాల వారికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. కుళాయిలు మంజూరు చేసిన 53 మంది పేర్లు బినామీ పేర్లు ఉండటమేమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. జాబితాను పరిశీలిస్తే పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు తమ అనుయాయిలకు కుళాయిలు ఉన్నవారికి, మరి కొంతమందికి రెండు కనెక్షన్లు మంజూరు చేసినట్లు ఉంది. ఒకే వీధి ఒకే సామాజిక వర్గానికి చెందిన 30 మందికి కుళాయి కనెక్షన్లు మంజూరు చేశారు. వారిలో అనేక మందికి గతంలోనే కుళాయిలు ఉన్నాయి. మిలిగిన వాటిలో ఎక్కువ మంది ఓసీలకు జాబితాలో చోటు కల్పించారు. గతంలోనూ కుళాయి కనెక్షన్ల మంజూరులో పెద్ద మొత్తంలో నిధులు గోల్‌మాల్ అయిన విషయం తెలిసిందే. ఉప్పుగుండూరు పంచాయతీకి వచ్చే ఆదాయంలో ఒక్కరూపాయి కూడా వృథా కాకుండా గత పాలకులు గ్రామాభివృద్ధి కషిచేశారు. తద్వార ఐదు సార్లు ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. అనంతరం ప్రత్యేక అధికారుల పాలనలో వసూలు చేసిన ఇంటి పన్నుల్లో కోటి రూపాయల మేర దుర్వినియోగం అయ్యింది. ఈ విషయంపై ప్రజాశక్తి దిన పత్రికలో వచ్చిన కథనాలకు స్పందించిన అప్పటి కలెక్టరు విచారణకు ఆదేశించారు. విచారణ చేపట్టిన అధికారులు రూ. 25లక్షల మేర అవినీతి జరిగినట్లు లెక్కలు తేల్చారు. దీంతో ఇద్దరు అధికారులు సస్పెండ్ అయ్యారు. సస్పెండ్ అయిన అధికారుల దుర్వినియోగం అయిన నిధులు రికవరీ చేశారు. ఆవిషయం మరుక ముందే పంచాయతీలో అవినీతి జరిగినట్లు ఇటీవల గ్రామ సర్పంచే స్వయంగా జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు పై 20 రోజుల క్రితం డిఎల్‌పిఒ పద్మావతి విచారణ చేపట్టారు. సంబంధిత రికార్డులను డిఎల్‌పిఒ తమ వెంట తీసుకెళ్లారు. పంచాయతీలో ఏమేర అవినీతి జరిగిందనే విషయం గురించి డిఎల్‌పిఒ అధికారులు నివేదిక అందజేయలేదు. దీంతోపలు అనుమానాలకు తావిస్తుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జలజీవన్, జంగిల్ క్లియర్స్, బ్లీచింగ్ కొనుగోలు విషయంతో ఎక్కువ మొత్తంలో ఖర్చు చేసినట్లు లెక్కలు చూపి నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. జిల్లా స్థాయి అధికారులు స్పందించి పంచాయతీ, జలజీవన్ పథకంలో అవినీతిపై విచారణ జరిపించి బాధ్యులతపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కమిటీ జాబితా ప్రకారంమే కనెక్షన్లు

వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ

మంజూరు కమిటీ ఇచ్చిన జాబితా ప్రకారమే జలజీవన్ పథకం ద్వారా కుళాయిలు మంజూరు చేస్తారని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకటేశ్వర్లు తెలిపారు. అందులో తమకు ఎలాంటి సంబంధమూ లేదని ఆయన తెలిపారు.